4
నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 15 ఏప్రిల్ 2024
www.ntnews.com


# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

విగ్రహారాధనకు సంబంధం లేని ఆదివాసీ ప్రజల చెట్లు చేమల ఆరాధన పద్ధతులూ, కుల వివక్షను తొలగించిన సంస్కరణవాద హిందూ మతాచారాలు, బుద్ధుని శాంతితత్వాన్ని కలగలిపిన మూడు మతాల అద్భుత సంగమాన్ని మనం ఒడిశాలోని పూరి జగన్నాథ పూజా విధానంలో చూడవచ్చు. మానవ చరిత్రలో విభిన్నమైన మూడు మతాలు శాంతిపూర్వకంగా పాలునీళ్లలా సమ్మేళనమై జన జీవనంలో భాగమై, ఇప్పటికీ ఆ సుహృద్భావ వాతావరణాన్ని కొనసాగిస్తున్న ఏకైక ఉదాహరణ- పూరి జగన్నాథ్ ఆరాధనా విధానాలు.

వేదాలను, యజ్ఞయాగాలను అంగీకరించని బుద్ధుడు హిందువుల ఆరాధ్యదైవమైన విష్ణువు 9వ అవతారంగా హిందూమతంలో స్థానం పొందడమేగాక, ఇక్కడే బౌద్ధం హిందూమతంలో విలీనమైపోయింది. తద్వారా హిందూ మతంలోని కుల వివక్షలను, ఆదివాసుల పట్ల చిన్నచూపును తొలగించి, దేవుని పట్ల భక్తికి కులం, జాతి, మతాలు అడ్డుగోడలు కావనే ఆ కాలం నాటి భక్తి ఉద్యమాల లక్ష్యాన్ని నెరవేర్చింది.





# మూడు మతాల సంగమ స్థలి

శ్రీస్తుశకం 12వ శతాబ్దంలో పూరిలో పుట్టిన ప్రఖ్యాత సంస్కృత కవి జయదేవుడు రాసిన గీతగోవిందం, బౌద్ధ హిందూ మతాల సంయోగానికి అద్దం పడుతుంది. యావత్ భారత దేశాన్ని కృష్ణ భక్తి ఉద్యమంలో ఉర్రూతలూగించిన ఈ సంస్కృత గీతంలో బుద్ధుని విష్ణువు 9వ అవతారంగా కీర్తిస్తాడు. వేదాలను నిందించి, శ్రుతులకు విరుద్ధంగా జంతు బలులను నిరాకరించిన బుద్ధుడు కేశవుడేనని ఇలా భజిస్తాడు.

> నిన్దతి యజ్ఞ విధేరహహ శ్రుతిజాతం,
> సదయ హృదయదర్శిత పశుఘాతం,
> కేశవా ధృత బుద్ధ శరీరా,
> జయ జగదీశ హరే.

క్రీస్తుశకం 14వ శతాబ్దంలో వైష్ణవ భక్తి ఉద్యమ ప్రముఖ గురువు చైతన్య ప్రభువు బెంగాల్ నుంచి పూరికి తన నివాసాన్ని మార్చి అక్కడే చనిపోయేంత వరకు ఉన్నాడు. ఈ మూడు విభిన్న మతాల విచిత్ర సంగమం ఎలా సాధ్యమైనదో తెలియజేసే గాథ ఆసక్తికరంగా ఉంటుంది. ఆధునిక ఒడిశా నిర్మాతల్లో ఒకరైన పండిత నీలకంఠ దాస్ పూరిజగన్నాథ ఆరాధనా పద్ధతుల గురించి వ్యాఖ్యానిస్తూ హిందూ, బౌద్ధ మతాలు పరస్పరం సమన్వయంతో సమ్మిశ్రితం కావడం బహుశా ప్రపంచ మతాల పరిణామక్రమంలో మత సామరస్యానికి, సమ్మేళనానికి గొప్ప ప్రతీక అని అన్నారు. మహావిష్ణువు బుద్ధునిగా ఎలా అవతరించాడో పద్మ పురాణంలో వివరించడాన్ని పండిత నీలకంఠదాస్ తన రచనల్లో విశ్లేషించారు.

ఒడిశా అడవుల్లోని సవర ఆదివాసీలు చెట్టు బోదెలను తమ దేవతగా పూజలు చేస్తారు. మాళవ దేశ రాజు ఇంద్రద్యుమ్నుడు విష్ణు భక్తుడు. అతనికి కలలో విష్ణువు కనిపించి తనను బుద్ధావతారంలో సవర ఆదివాసీలు పూజిస్తున్నారనీ చెప్తాడు. సవరలు పూజించే బుద్ధదేవుని కనుగొనేందుకు రాజు తన మంత్రి విద్యాపతిని పంపుతాడు. అడవిలో సవరలు తమ పూజా విధానాన్ని గోప్యంగాత ఉంచడం వల్ల విద్యాపతి వాటిని కనుగోలేకపోతాడు. అతను ఆదివాసీలతో కొన్నేండ్లు సహజీవనం చేసి వారి అమ్మాయినే పెళ్లి చేసుకుంటాడు. వారి విశ్వాసం చూరగొన్న తర్వాత అతను సవరలు పూజించే బుద్ధావతార విష్ణు దేవతను తెలుసుకుంటాడు. రాజుకు విషయం తెలిసి అక్కడే మందిరాన్ని నిర్మిస్తాడు. అదే పూరి జగన్నాథ ఆలయం. ఇక్కడ నివసించే సవర ఆదివాసీలను జగన్నాథుని బంధువులుగా భావిస్తారు. వారిని దైత్యులని పిలుస్తారు. బ్రాహ్మణ విద్యాపతికి అతని సవర భార్యకు పుట్టిన వంశజులు ఇక్కడే ఉంటారు. వారిని పాటి బ్రాహ్మణులంటారు. వైదిక భక్తి ఉద్యమానికి పూర్వం ఇక్కడ బౌద్ధ, జైన మతాలు కూడా ప్రాచుర్యంలో ఉండేవి. బుద్ధుని దేవునిగా భావించి విగ్రహారాధనను అంగీకరించే మహాయాన బౌద్ధ ప్రచారకుడైన నాగార్జునాచార్యుడు క్రీస్తుశకం 3వ శతాబ్దంలో పూరికి వచ్చి ఇక్కడి విగ్రహారాధనకు వ్యతిరేకులైన హీనయాన బౌద్ధ అనుయాయులను మహాయాన బౌద్ధ అనుయాయులుగా మార్చివేశాడు. ఆదివాసీ సవరలు తమ దేవతలను వృక్ష కాండం రూపంలో పూజించే ఆచారాలనూ, వైదిక, బౌద్ధ మతస్థులు విగ్రహారాధనను సమ్మిళితం చేసిన సాంస్కృతిక ఉద్యమ పర్యవసానమే పూరి జగన్నాథ ఆరాధనగా పరిణామం చెందింది.

దీన్ని మనం ఆదివాసీ నమ్మకాల, బౌద్ధ, హిందూ మతాల సమ్మేళనంగా మాత్రమే కాకుండా, జైన పద్ధతుల సమ్మేళనంగా కూడా భావించవచ్చు. పూరి జగన్నాథ ఆరాధన ప్రాథమికంగా జైన ఆరాధన పద్ధతులే అంటూ పండిత నీలకంఠ దాస్ ఇందుకు ఉదాహరణగా జైనులు తమ తీర్థంకరులను నాథ్ పేరున పిలుస్తారని పేర్కొన్నారు.



ఆనందేశి నాగరాజు

పూరి జగన్నాథుని రథయాత్ర కూడా ఎంతో ప్రత్యేకత సంతరించుకుంది. దేవుళ్లను కొయ్య మానుతో చేసి పూజిస్తారు. ఇవి సాధారణ దేవతా విగ్రహాలకు మల్లే కాళ్లు, చేతులు, ఆయుధాలు, ఆభరణాలు కలిగి ఉండవు. చెట్టు మానులకు విశాలమైన కన్నులు దిద్ది ఉంటాయి. జగన్నాథుని చతుర్థ మూర్తిమంతునిగా కొలుస్తారు. సుదర్శనుడు, బలభద్రుడు, సుభద్ర, జగన్నాథులుగా పిలిచే ఈ నాలుగు కూడా చెట్టు మానుతో చేసినవే. ఆయా మూర్తులలో కొట్టొచ్చినట్టు కనిపించే విశాల నయనాలు తప్ప ఏ ఇతర శారీరక అంగాలు ఉండవు. ఆదివాసీ సవరల వంశజులే ఈ దేవుని ప్రతినిధులు, పూజారులు. ఇక్కడ పాలించిన రాజులు తాము జగన్నాథుని సేవకులుగానే భావిస్తూ అతని రథయాత్ర ముందు చీపురుతో ఊడ్చేవారు.


> తమ మతమే అన్ని మతాల కన్నా మిన్న అనే ఈ కాలపు మత నాయకులకు అన్ని మతాలు సమన్వయంతో ఎలా సహజీవనం చేయవచ్చో పూరి జగన్నాథ ఆరాధన పరిణామం ఒక మేలుకొలుపు.

ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను అధ్యయనం చేయడంలో, వాటి చారిత్రక, సామాజిక అంశాలను అర్థం చేసుకోవడంలో చాలామంది విఫలమవుతారు. ముఖ్యం గా హేతువాదులు, ఆస్తికులు, నాస్తికులు ఈ పొరపాట్లు చేస్తారు. వీటి అధ్యయనంలో కనిపించే గందరగోళానికి శాస్త్రీయ కారణాలు వివరిస్తూ ప్రపంచ మతాల, పౌరాణిక, కాల్పనిక ఆచారాల తులనాత్మక పరిశీలన చేసిన ప్రఖ్యాత రచయిత జోసెఫ్ క్యాంప్‌బెల్ ప్రపంచంలో సగం మంది తమ మత గ్రంథాల్లో, పౌరాణిక గాథల్లో వర్ణించిన విషయాలను ప్రతీకలుగా, ఉపమానాలుగా అర్థం చేసుకోకుండా వాటిని అక్షర సత్యాలుగా భావిస్తారు. మిగిలిన సగం మంది ఆయా వర్ణనలను యథాతథంగా అర్థం చేసుకొని అసత్యాలనీ, అభూత కల్పనలని తేలుస్తారు. అందువల్ల, మనం ఒక వైపు ప్రతీకలని, ఉపమానాలను పరమ సత్యాలని భావించే ఆస్తికులనూ, మరోవైపు మతాచారాల ప్రతీకలను తప్పుల తడకలుగా భావించే నాస్తికులను చూస్తామన్నాడు.

> మన దేశంలో కూడా చాలామంది చరిత్రకారులు మన ప్రాచీన పౌరాణిక, కాల్పనిక సాహిత్యాన్ని సరైన అవగాహన లేకుండా పుక్కిటి పురాణాలుగా కొట్టిపడేస్తారు. అంతేకాకుండా, దేవీ దేవతల అవతారాల గురించి, వారి ఆరాధన పద్ధతుల పుట్టుపూర్వోత్తరాల గురించి అధ్యయనం చేసేటప్పుడు కేవలం ఒకే సాహిత్య కథనంపై ఆధారపడకుండా అనేక ఇతర ప్రాచీన సాహిత్యాలను కూడా ఒకదానితో మరొకటి సరిచేసుకొని అధ్యయనం చేయాలి.

మన దేశంలో క్రీస్తుశకం 10వ శతాబ్దంలో మహమ్మద్ గజనితో పాటు పర్యటించిన ఇరాన్‌కు చెందిన ముస్లిం పండితుడు అల్ బెరూని సంస్కృత పౌరాణిక గ్రంథం విష్ణు ధమ్మాని అధ్యయనం చేసి, భారత దేశంలో బౌద్ధ మత ఆవిర్భావం గురించి అందులో పేర్కొన్న అంశాలను ఇలా వివరించాడు. విష్ణువు బుద్ధావతారం గురించి శౌనక ఋషికి చెప్తూ.. 'కలియుగంలో జనులలో సద్విశ్వాసాన్ని వ్యాపింపజేయడానికి ధర్మపరాయణుడైన శుద్ధోదనుని కుమారునిగా బుద్ధుడిని పంపాను. అయితే, రక్తవర్ణ వస్త్రాలు ధరించే అతని అనుయాయులు (బౌద్ధ శ్రమణులు) అతని బోధనలను వక్రీకరించి బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని తొలగిస్తారు. శూద్రులు బ్రాహ్మణులను అగౌరవ పరుస్తారు. వర్ణాశ్రమ వ్యవస్థ నశించిపోతుంది' అని అంటాడు.

బౌద్ధ మత పుట్టుక గురించి అగ్ని పురాణంలో మరో కథనం ఉన్నది. ఒకానొక కాలంలో సురులకు, అసురులకు జరిగిన యుద్ధంలో దేవతలు ఓడిపోయారు. దానవుల నుంచి తమను కాపాడమని వారు శివునితో మొర పెట్టుకోగా తాను కలియుగంలో శుద్ధోదనుని కుమారునిగా జన్మించి అసురులను బౌద్ధ అనుయాయులుగా మారుస్తాననీ, వారు వేదాలను తిరస్కరించి పాషండులుగా కలియుగాంతం వరకు జీవిస్తారని చెప్తాడు! అగ్ని పురాణంలో శివుడే బుద్ధునిగా అవతరించాడని చెప్పారు!



కాంగిరేసు పాలనొచ్చెనా రైతన్నా
కరువు బాధ వెంట తెచ్చెనా
నీ పంటను ఎండబెట్టెనా రైతన్నా
నీ బతుకుల మంట పెట్టెనా..
ఇంతలోనే తెలంగాణ ఎందుకింత
ఆగమాయె?
మంచిగున్న రైతు బతుకు మసకబారి
పోయేనేల?
ఎండిపోయిన పంటసేను పసుల
మేతకిడ్శినావ
పగ్గెలు పాసిన పొలములోన పొర్రి
పొర్రి ఏడ్శినావ
కాంగిరేసు పాలనొచ్చెనా
మాయమైన బోరు బండ్లు మళ్ల ఊరి
దారి పట్టె
బాయి పూడ్కె దీసె క్రేను మోత మల్ల
మోగవట్టె
వచ్చీపోయే కరెంటుతో మోటరేమో కాలిపాయే
కర్సులేమో పెరిగిపాయె అర్సుకునె దిక్కే లేదు
అడ్గపోతే ముఖ్యమంత్రి కయ్య కయ్య ఒర్రవట్టె
రైతన్నల పానాలతో రాజకీయమాడవట్టె
కాంగిరేసు పాలనొచ్చెనా
ఎత్తు మీదికి ఎత్తి పోసిన గోదావరి నీళ్లు ఏవీ?
ఎండకాలమైన దుంకిన మత్తడి జాలు జాడేమాయే?
కువారాన ముఖ్యమంత్రి కుట్ర మనసుల పెట్టుకోని
కాళేశ్వర ప్రాజెక్టును కావాలని పండవెట్టి
దుక్కమెల్లదీసె రైతు దిక్కూగూడ చూడడాయే
కిరికెట్టు మ్యాచును చూసి కిల కిల కిల నవ్వుడాయే
కాంగిరేసు పాలనొచ్చెనా

> పంటగోసె కాలమైన రైతుబంధు రాకపాయే
> షావుకారు కాడ మల్ల అప్పు జెయ్యక
> తప్పకపాయే
> వడ్డీ మీద వడ్డీ పెరిగి నడ్డి ఇరిగిపోయినాది
> ఉరివేసుక రైతన్నలు ఉసురు తీసుకుంటున్నారు
> మదమెక్కిన మంతిరేమో మంచీచెడ్డ
> మరిచిపాయే
> రైతుబంధు అడిగినోన్ని చెప్పుతోని కొడుతాననె
> కాంగిరేసు పాలనొచ్చెనా

మాటలెన్నో జెప్పి మనల మాయజేసే కాంగిరేసు
పంటలన్నీ కొంటానని ప్రమాణమూ జేసినాది
ఐదొందలు బోనసని ఆశపెట్టి గెలిచినాది
వానాకాలం పంటనమ్మితే బోనసు లేదు గీనసు లేదు
యాసంగి పంటనమ్మితే మోసమే ఎదురయ్యినాది
బోనసనే మాట ఉత్తబోగసనే తేలినాది
కాంగిరేసు పాలనొచ్చెనా
తెలంగాణ కోసమని పోరాడిన కేసీఆరు
తెచ్చుకున్న తెలంగాణ ఎంతో సక్కగ చేసినాడు
పంపు నిండ నీళ్లు ఉండే - తెంపు లేని కరెంటుండే
రైతుబంధు సాయముండే సర్కారిచ్చిన హిమ్మతుండే
పుట్ల కొద్దీ పంట దీసి పైసా కండ్ల జూసినాము
ఖర్మగాలి కాంగిరేసుకు ఓటు వేసి మోసమాయే
కేసీఆరుతోటే మల్ల పోరుబాటల నడుద్దాము
కరువు లేని తెలంగాణకై రైతన్నా - కారు
గుర్తుకోటువేద్దాము
కాంగిరేసు పని పడదాము రైతన్నా- కేసీఆర్‌కే
బలమిద్దాము

## కాంగిరేసు పాలనొచ్చెనా రైతన్నో



దేశపతి శ్రీనివాస్



## గుండె మాత్రమే తడిసిపోతుంది

ఏడ్చి ఏడ్చి కర్చీఫ్ తడిసిపోయింది
దుఃఖించీ దుఃఖించీ దిండు తడిసిపోయింది
రోదించీ రోదించీ ముఖం తడిసిపోయింది

అని, లోకులు అనుకొంటారు

సానుభూతితో బాధపడతారు
ఓదార్పులతో ఉక్కిరి బిక్కిరి చేస్తారు

నిజానికీ,...
ఇవన్నీ తడిసిపోవడానికి
కన్నీళ్లలో,
వర్షం చినుకుల్లా నీళ్లుండవు,...

అందులో,...
ప్రేమలుంటాయి
బరువులుంటాయి
బాధ్యతలుంటాయి
ఫీలింగ్స్ ఉంటాయి

అవి కారినా
జారినా
రాలినా
అలజడితో పొంగి పొలికినా,..

గుండె తడిసిపోతుంది కానీ,
బట్టలు తడిసిపోవు
బిస్తర్లు తడిసిపోవు
దుప్పట్లు తడిసిపోవు
నాని నాని మనసు మాత్రం
దూదిపింజలా ముద్దవుతుంది



ఆశారాజు
93923 02245

# భద్రగిరి పద్యకవి పట్రా మరియన్న

కవుల రత్నగర్భం వంటి తెలంగాణ మాగాణంలో మరుగున పడ్డ మరో కవి రత్నం పట్రా మరియన్న. కడు పేదరికంతో కష్టపడి చదివి, నాటి తెలుగు ఉపాధ్యాయులు చేసిన బోధనా మాధుర్యంలోని పాండిత్యాన్ని వంట పట్టించుకున్నారు. నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా ఖండ కావ్యాలు దొరికినంతవరకు ఆమూలాగ్రం చదివి సాధనతో సహజ కవిగా తనలోని భావాలకు పద్యరూపం అందించారు కవి పట్రా మరియన్న.

మరియన్నలో ఒక మహత్తర గుణం ఉండేది. ఆయన రాసిన పద్యాలు అన్నీ కంఠతః చెప్పేసేవారు. అంతటి ధారణ గలవారు కావడం వల్లే ఆయన పద్యాల్లో చక్కని నడక సరళత కనిపిస్తాయి. ఈ నిరుపేద ఉపాధ్యాయ కవి రాసుకున్న పద్యాలన్నీ పాత నోటు పుస్తకానికే పరిమితమైపోయాయి. పుస్తక రూపమంటే ఆకాశపుష్పమే అయింది! అయినా తను చూసిన విషయాలు, తనకు కలిగిన భావాలను అందమైన పద్యాలుగా రాసుకోవడం మాత్రం మానలేదు, అలా రాసుకున్న వందల పద్యాలన్నీ 1986లో సంభవించిన గోదావరి వరదల్లో గంగపాలయ్యాయి. కవితల కాగితాలు నీటి పాలు కావడంతో కన్నీటి పర్యంతమై ఆప్తులను కోల్పోయిన తీరున వలవల ఏడ్చారు.

నిత్యం సాహితీ స్నేహితులతో సాంగత్యం చేస్తూ సమావేశాల్లో పాల్గొంటూ తన సాహితీ వ్యసనాన్ని వీడలేదు. కొడిగట్టిన దీపంలా తనలోని కవితాపద్య జ్యోతి మిణుకుమిణుకు మంటూనే ఉండేది. భద్రాచలంలో విద్యాలయాల అధిపతి సామాజిక ఆధ్యాత్మిక సేవా భావాలు గల డాక్టర్ ఎస్.పాల్‌రాజ్ ఆదరణతో ఆయననే కృతిభర్తగా చేస్తూ తనలో గూడు కట్టుకున్న కవితా భావాలను ఆవేదన పేరుతో కావ్య కన్యకగా తయారుచేశారు. గోదావరి వరదల్లో కలిసిన తన పద్యాలను సైతం దేవుడు తనకు ఇచ్చిన ధారణ శక్తితో మళ్లీ అక్షరబద్ధం చేసుకున్నారు. 'వ్యత్యయాలు, గోవిలాపం, నైతిక పతనం, కాకులు' అనే పేర్లతో నాలుగు ఖండాలు గల ఈ దీర్ఘ



నేడు పట్రా మరియన్న వర్ధంతి

కవితల ఖండకావ్యం 1998 ఫిబ్రవరిలో తెలుగు సాహితీ క్షేత్రంలో అడుగిడి నాటి ప్రముఖ పండితుల ప్రశంసలందుకున్నది.

కోడి పిల్లలను ఎత్తుకుపోతున్న గద్ద ముఖ చిత్రంతో ముస్తాబైన 'ఆవేదన' ఖండకావ్యంలో వస్తు వైవిధ్యం కనిపించిన భావ సారూప్యత మాత్రం ఒక్కటే. ధనిక, పేద తారతమ్యాలను బేరీజు వేస్తూ సమాజంలో పేదలు అనుభవిస్తున్న దారిద్ర్యాన్ని స్వానుభవంతో తన పద్యాల సాయంగా కళ్లకు కట్టారు. మరియన్న పద్యాలలో కరుణ రసంతో పాటు ధర్మాగ్రహపు రౌద్ర రసం ఉంటుంది, సంభాషణలు ఉంటాయి, చమత్కారాలు కనిపిస్తాయి కథా కథనాలతో పాఠకులకు మధురానుభూతులు పంచారు మరియన్న. సాధారణ చదువరి అయిన మరియన్నలో అంతటి సాహితీ పట్టు అక్షర పుష్టి ఎలా వచ్చాయని ఆశ్చర్యం కలగక మానదు.



డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు
77298 83223

'వ్యత్యయము' అనే తొలి ఖండంలో ఒక ధనవంతుని కుమార్తె పుష్పవతి అయిన సందర్భంగా అతని గృహాన్ని అందమైన విద్యుత్తు దీపాలతో ఎలా అలంకరించారో చెప్తూనే.. అదే ప్రాంతంలోని ఒక పూరి గుడిసెలోని అనాథ బాలికల్లో ఒక బాలిక పుష్పవతి అవ్వగా చీకటిలో నిదురించరాదనే నియమంతో ఊరంతా తిరిగినా ఎక్కడా ఒక దీపం కూడా దానంగా దొరకని హృదయ విదారక దృశ్యాన్ని హృద్యంగా అక్షరీకరించారు మరియన్న కవి.

'కరమున్ జాటు చేసి కన్నీరు గార్చుచు/ శిరము వంచి యెరిగి దరికి తిరిగి/ అక్క పుష్పవతిగ నయ్యె నటంచును/ చెప్పె చిన్న పిల్ల సిగ్గుపడుచు..' అక్కడ ధనవంతుడి గృహం, ఇక్కడ పేదవాని గుడిసె చేసే పని ఒక్కటే. కానీ, అందులో అంతుబట్టని వ్యత్యాసం కనిపిస్తుంది.

> స్వార్థపరులైన కొందరు ధనికులు, పేదలకు కర్మసిద్ధాంతం అంటగట్టి అణగదొక్కుతున్నారు కానీ ప్రజలు చైతన్యవంతులై ప్రగతి పథంలో పయనించే రోజులు వస్తాయని దొరతనం సాగదని తనదైన ఆశాభావం వ్యక్తపరుస్తారు. ఇలా సామాజిక సమస్యలనే తన కవితా వస్తువులుగా తీసుకొని అందమైన పద్యాలు అల్లిన ఈ అజ్ఞాత తెలంగాణ దళితకవి 1937 ఏప్రిల్ 1న తొలి శ్వాసతో ఈ లోకానికి వచ్చి, 2000 ఏప్రిల్ 15న ఆఖరి శ్వాస విడిచారు. ఈ భద్రగిరి పద్యకవి పట్రా మరియన్న తన ఏకైక పద్య కావ్యం 'ఆవేదన' ద్వారా సదా అక్షర చిరంజీవిగా వర్ధిల్లుతారు.

## ఆహ్వానం

### పురస్కార ప్రకటన

**తెలుగు** చలన చిత్రకళకు జీవం పోసిన మహా నటు ల్లో ఒకరైన నట సామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరా వు శత జయంతిని పురస్కరించుకొని 2023 సంవత్సరానికి గానూ సిరికోన-జొన్నలగడ్డ రాంభొట్లు, సరోజ మ్మ స్మారక పురస్కారానికి ఎంపికైన నవలల పేర్లను ప్రకటించారు. ప్రతిభావంతులైన రచయితలను ప్రోత్సహించేందుకు పురస్కార మొత్తాన్ని 1.శ్రీమద్రమారమణ నవలా రచయిత డా.పాణ్యం దత్తశర్మకు, 2.హృదయగానం: నేడే విడుదల రచయిత్రి కోసూరి ఉమాభారతి (హ్యూస్టన్)కి సమానంగా అందించాలని న్యాయనిర్ణేతలు నిర్ణయించారు. కచ్ఛపి నాదం రచయి త్రి మంథా భానుమతికి ప్రత్యేక బహుమతిని ప్రకటించారు. త్వరలో జూమ్ మాధ్యమంలో పురస్కార, బహుమతి సమర్పణ, సత్కారం జరుగుతుంది.

**- జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, (డాలస్) సిరికోన పక్షాన**

### సమూహ గానం

**హైదరాబాద్‌లోని** సుందరయ్య భవన్‌లో సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ప్రజాస్వామిక, లౌకిక రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం 178 మంది కవులు, వాగ్గేయకారులతో సమూహ గానం జరుగనున్నది. కె.శ్రీనివాస్ ప్రారంభోపన్యాసం చేస్తారు. ముఖ్య అతిథిగా కె.శివారెడ్డి పాల్గొంటారు. అందరూ ఆహ్వానితులే.

### ఆత్మీయ సభ

**ప్రముఖ** కవి, రచయిత బుర్రా లక్ష్మీనారాయణ సంస్మరణార్థం ఈ నెల 15న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య కళానిలయంలో ఆత్మీయ సభ జరుగుతుంది. డాక్టర్ రూప్‌కుమార్ డబ్బీకార్ అధ్యక్షత వహిస్తారు. కేవీఎస్ వర్మ, ఏనుగు నరసింహారెడ్డి, ఎం.నారాయణశర్మ, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, గుడిపాటి ప్రసంగిస్తారు.

### కవితల పోటీ

**'పాలపిట్ట** - వాసా' ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ వాసా ప్రభావతి స్మారక కవితల పోటీ జరుగనున్నది. జాతీయ సమగ్రత, మత సామరస్యం, సమాజంలో ఉన్నతమైన విలువలను పాదుకొల్పాలనే లక్ష్యంతో సుప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ వాసా ప్రభావతి సంస్మరణార్థం కవితల పోటీ నిర్వహించాలని పాలపిట్ట-వాసా ఫౌండేషన్లు సంకల్పించాయి. ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 2, బ్లాక్-6, ఎంఐజీ-2, ఏపీహెచ్‌బీ బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500 044చిరునామాకు ఈ నెల 30వ తేదీలోపు కవితలు పంపించాలి. ఎంపికైన వారికి మొదటి బహుమతి రూ. 3 వేలు, రెండో బహుమతి రూ. 2 వేలు, మూడో బహుమతి రూ.వెయ్యి, ఎనిమిది కవితలకు రూ.500 చొప్పున ప్రత్యేక బహుమతులు ఇవ్వనున్నట్టు పాలపిట్ట ఎడిటర్ గుడిపాటి తెలిపారు. మే 15న ఫలితాలు ప్రకటిస్తారు. వివరాలకు 94900 99327 నంబర్‌ను సంప్రదించండి.

### కరోనా సాహిత్యం

**'తెలుగు** సాహిత్యంలో కరోనా కల్లోలం' అనే అంశంపై కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ వారి నుంచి సీనియర్ ఫెలోషిప్‌కు ఎంపికై నేను పరిశోధనలు చేస్తున్న విషయం సాహితీ మిత్రులకు తెలిసిందే. అయితే ఈ అంశంపై నేను ఇప్పటికే కొన్ని పుస్తకాలను సేకరించాను. నాకు తెలియనివి ఇంకా అనేక రచనలు ఉండొచ్చు. ఈ 'కరోనా' విషమ కాలాన్ని రికార్డు పరిచి భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే నా లక్ష్యం. కనుక దయచేసి కరోనా అంశంపై వివిధ పత్రికల్లో మీరు రాసిన, మీరు చదివిన, మీ దృష్టికి వచ్చిన కథ/ కవిత/ నవల/ వ్యాసం, ప్రత్యేక సంపుటాలు, సంకలనాలు తదితర వివరాలను 92474 75975 వాట్సాప్ నంబరుకు పంపించాలని సాహితీవేత్తలందర్నీ కోరుతున్నా.

**- చలపాక ప్రకాష్**